# న్యాయం

ఎండ మండిపోతోంది. వడగాల్పులు నిర్దాక్షిణ్యంగా వీస్తున్నాయి. శరీరాలు చెమటలు కక్కుతున్నాయి. నాలుకలు ఎండిపోతున్నాయి. ఎన్ని నీళ్లు తాగినా తీరదు దాహం. అసలు తీరే దాహమేనా ఇది? గ్లాసెడు మంచినీళ్ళకు మూడు పైసలు... అదీ వేలెడంత గ్లాసు. అందులోనూ ఒక అంగుళం తక్కువగా ఉండేటట్లే ఇస్తారు నీళ్ళు. అవును మరి వాడి వ్యాపారమూ సాగాలి. ఒక గ్లాసుతో తృప్తిపడక ఇంకో గ్లాసు నీళ్ళు మనం అడగాలి. నీళ్ళతో కడుపు నిండిపోయినా నోట్లో మాత్రం తడి ఉండదు. జిహ్వాచాపల్యం కొద్దీ ఐస్ క్రీమ్‌లూ, సాఫ్టీలు తింటే పర్సులో నుండి రూపాయలు, రూపాయలు ఎగిరిపోవడమే గాని దాహం తీరదు. కోకాకోలా తాగితే దాహం తీరినా తీరకపోయినా కడుపు నిండుగా ఏదో ద్రవపదార్థముందనే తృప్తి మిగులుతుంది.

అందుకే ఆ డ్రింక్సు షాపుకు వెళ్లాను. అది బస్‌స్టాపు పక్కని చిన్న కొట్టు. అక్కడ బేరం ఎప్పుడూ ముమ్మరంగానే సాగుతూ ఉంటుంది. బస్ కోసం నిల్చుని, నిల్చుని విసుగు పుట్టి, అవసరమున్నా లేకున్నా అక్కడేదో కొని నములుతూ ఉంటారు చాలా మంది. ఎండకాలం వచ్చిందంటే ఇక కూల్ డ్రింక్సుకు గిరాకీ చెప్పాలా?

జనం బాగా ఉన్నారేమో కొట్టు వాడికి నా అభ్యర్థన వినిపించినట్లు లేదు. భగవంతునికి తమ కోర్కెలు మొరపెట్టుకొంటున్నట్లు అందరూ గోలగోలగా అరుస్తున్నారు.

"ఒక కోకా కోలా."

"రెండు ఫాంటాలు..."

"ఇక్కడ ఒక గోల్డ్‌స్పాట్."

"రూపాయి ఇచ్చాను యాభైపైసలు వాపసు రావాలి."

"ఇదిగో నా మాట వినిపించుకోవేమయ్యా? సిమ్లా సిగరెట్ ప్యాకెట్..."

"సిగరెట్ కేం తొందర. నా నాలుక పిడచ కట్టుకుపోతోంది..."

"బాగుందే! నీకున్న తొందరే నాదీను."

కొట్టువాడు రెండు చేతులతోనే ఆరు చేతుల పని చేస్తున్నాడు. డబ్బు వసూలు చేయడం, చిల్లరివ్వటం... అడిగిన డ్రింకులివ్వటం... నుదుటికి పట్టిన చెమట అడపాదడపా చొక్కాచేత్తో తుడుచుకోవడం...

"ఏందయ్యా చెబ్తుంటే నీక్కాదూ? ఏం భిక్షగాళ్లమనుకున్నావా నీ దగ్గర పడిగాపులు పడి ఉండటానికి?" నాలుగు వేళ్ళకూ రాళ్ళ ఉంగరాలు పెట్టుకున్న టెర్లిన్ చొక్కా పెద్ద మనిషి దబాయిస్తున్నాడు. అతని నల్లటిమెడలో బంగారపు గొలుసు కూడా తళుక్కుమంటోంది.

కొట్టువాడు వినిపించుకోలేదు. అవతలివాడి నుండి డబ్బులు వసూలు చేయడంలో మునిగి ఉన్నాడు. టెర్లిన్ చొక్కా వ్యక్తి ముందుకు దూసుకెళ్ళి కొట్టువాడి చేతిని లాగాడు. "ఏహె... ఉండహె" అని చేయి విదిలించుకున్నాడు వాడు చిరాగ్గా. అంతే... టెర్లిన్ చొక్కావాడు మెరుపులా కోకాకోలా సీసా అందుకొని కొట్టువాడి నెత్తిన ఫెడీమని కొట్టాడు. సీసా భళ్లున పగిలింది. మా అందరి గుండెలూ ఝల్లుమన్నాయి. మేమంతా బిర్ర బిగుసుకుపోయాం. కొట్టువాడి నెత్తి నుండి రక్తం ధారలు కట్టింది. వాడు పక్కకు వాలిపోయాడు.

ఒక్కసారిగా అసలు పరిస్థితి అర్థమయింది అందరికీ. గోల గోలగా మాట్లాడుతున్నారు.

"ఏందయ్యా ఈ విపరీతం... ఏం పొయ్యే కాలమొచ్చింది?"

"వాడిని తన్నండర్రా."

"వద్దు మనకెందుకొచ్చిన గొడవ. పైగా పెద్దమనిషి."

"పెద్ద మనిషిట! పెద్దమనిషి... పళ్లు రాలగొట్టే సరి."

"పోలీసులకు ఫోను చెయ్యండి."

"అంబులెన్సుకూ..."

"ఈ పెట్టుబడిదారుల దౌర్జన్యం నశించాలండి... లేకపోతే ఒక షావుకారు పట్టపగలు ఒక పేదవాడి తల బద్దలుకొట్టాడా?"

"నయమే. ఇక ఉపన్యాసం మొదలుపెట్టకు. నలుగురూ నవ్వేరు."

"ఏం నీ సొమ్మేం పోయింది? ఇటువంటి దౌర్జన్యాలు భరించటానికి శ్రామికులింకా మూర్ఖులుగా లేరు. మేమింక మీ స్వార్థానికి వ్యతిరేకంగా విజృంభించి విప్లవం తెస్తాం. రక్తం స్రవింపజేస్తాం..."

"చాలించవయ్యా స్వామీ ఇక్కడ ఒకడి రక్తం ఇప్పుడే స్రవిస్తోంది. అది ఆపటానికి ఏదైనా ఉపాయం చూడు."

"ఇంతకూ వాడెవడు?."

"ఎవడో తాగుబోతు."

"కాదండీ బందిపోటయ్యుంటాడు. ఆ ఉంగరాలూ, నగలూ, వాలకం తెలియటం లేదూ!"

"మీకు తెలీదులెండి. ఇదంతా నక్సలైట్ల పనే."

"ఛీ! ఛీ! ఆ పేరును అర్థం పర్థం లేకుండా వాడకండి."

"ఏం తమకేమయినా సంబంధముందా?"

"ఆఁ ఉంది. నేనే వాళ్ళ నాయకుడిని పోలీసుల కప్పజెబుతారా?."

"ఈ దేశంలో న్యాయమెక్కడ వుంది నాయనా? మనిషిని మనిషి పీక్కుతిన్నా ఆశ్చర్యం లేదు. కాకపోతే పట్టపగలు పది మంది ఎదుట ఈ రక్తపాతం జరిగేదేనా?"

"ఈ ముసలాడెవరో గాంధీ భక్తునిలా ఉన్నాడే!"

"కాదు. దేశభక్తుడయి ఉంటాడు." ఇంతలో బొయ్ బొయ్ మంటూ పోలీసువ్యాను వచ్చింది. అందరినోళ్లూ ఠక్కున మూసుకొని, మరలా కొద్దిగా తెరుచుకొన్నాయి.

"ఏం జరిగింది?" సబ్-ఇన్స్పెక్టరు అడిగాడు.

టెర్లిన్ చొక్కా వ్యక్తిని ఐదారుమంది ఘెరావ్ చేసినట్లున్నారు.

"ఈయన, అతని తల బద్దలుకొట్టాడు... అతను చచ్చిపోయాడు." కొట్టువాడు రక్తంతో నిండిన కన్ను ఒకసారి తెరిచి బాధగా మూల్గాడు, తన గుప్పెడు ప్రాణాలూ గుప్పెట్లోనే ఉన్నాయని ప్రకటించటానికి.

ఎక్కడో పాతగుడ్డ సంపాదించి కానిస్టేబులు ఒకడు కొట్టువాడి తలకు చుట్టాడు.

ఇన్స్పెక్టర్ అటూ కొట్టువాడినీ, ఇటు టెర్లిన్ చొక్కా వాడినీ చూశాడు. అతని కళ్ళు ఎర్రబడ్డాయి. మీసాల మీదకు చేయిపోయింది. "ఏం పని చేశావురా వెధవా" అన్నాడు టెర్లిన్ చొక్కావాడితో.

ఆ పెద్దమనిషి కళ్ళు మరింత ఎర్రబడ్డాయి. ఏదో అనాలని నోరు తెరిచాడు. అంతే వాడి దవడ ఫెడేల్ మంది. వాడి తల దిమ్మెక్కినట్లుంది. ఈ లెంపా ఆ లెంపా ఎడాపెడా వాయించేస్తున్నాడు ఇన్స్పెక్టరు. గట్టిగా గడ్డంకింద తగల్నిచ్చాడు. నోట్లోంచి రక్తం వచ్చింది. ముక్కు మీద గుద్దాడు. ముక్కులోనుంచి కారిన రక్తంతో

వాడి చొక్కా తడిసిపోతోంది. ముందుకు వంగాడు. వాడి వీపు మీద తన్నాడు ఇన్‌స్పెక్టరు. వాడు నేలను కరుచుకొన్నాడు. దుమ్మంతా నోట్లోకి పోయింది. కొంచెం రక్తం దుమ్మును తడిపింది. బూటుకాళ్ళతో కడుపులో, డొక్కలో... ఇష్టమొచ్చిన చోటల్లా తన్నుతున్నాడు ఇన్‌స్పెక్టరు. పోలీసువాళ్ళు లాఠీలు సర్దుకుని నిలబడ్డారు. అవకాశానికో, ఆజ్ఞకో ఎదురు చూస్తున్నట్లు. టెర్లిన్ వాడి చొక్కా చిరిగింది. ప్యాంటు ధూళిమయమయింది. కళ్ళజోడు విరిగిపోయింది. వాచీ బద్ధలయింది. నిరోధించే శక్తి లేనట్టు, నిస్సత్తువగా దెబ్బలు తింటున్న కుక్కలా ముడుచుకు పడి ఉన్నాడు. అసలు తెలివుందో లేదో! "లాక్కెళ్ళండి" ఇన్‌స్పెక్టరు హుకుం అవగానే ఇద్దరు పోలీసులూ వాడిని బరబరా లాక్కెళ్ళి వ్యానులోకి తోశారు. మూల్గుతున్న కొట్టువాడినీ బండిలోకి చేరవేశారు. ఇన్‌స్పెక్టరు కర్చీఫ్‌తో చెమట ఒత్తుకుంటూ ఫ్రంటుసీటు చేరాడు. తలుపు ధన్‌మని మూసుకుంది. వ్యాన్ బర్ మంటూ ముందుకు సాగింది.

ఆంధ్రజ్యోతి వారపత్రిక

12 మార్చి 1971